# శారద

శ్రీ వై. వి. శర్మ

"తాయం పెడ్తావా? లేదా? పెట్టక పోతే నీ జత ఉండను" అన్నాడు సుబ్బారావు.

"ఇప్పుడు పెడ్తే జత ఉంటానంటావా? పెట్టకపోతే పచ్చికొట్టేస్తావేం!" అంది శారద

"అబ్బే శారదా! ఎప్పుడూ నీజతే ... వాళ్ల శేషు నిన్ను కొట్టడానికొస్తే నీ పక్షం ఉంటాను; మనిద్దరంకలసి శేషును కొడ్దాం. మరి నాకు కొంచెం పెట్టు" అని బావ సుబ్బారావు, మరదలుశారదను బుజ్జగించాడు. గంటక్రితమే, బావ తనను మొట్టికాయ వేశాడు; అందుకని కోపగించింది శారద; కాని బావ నవ్వుతూ మాట్లాడేటప్పటికి, ఆ నవ్వులో యేముందోగాని, శారదహృదయం వెంటనే మారిపోయింది. కోపండున్న మనిషిని చిటికెలో నవ్విస్తాడు బావ. ఎప్పుడూ అల్లరే! బావతో మాట్లాడకూడదనుకుంది. కాని మాట్లాడ లేకుండా ఉండలేకపోయింది. తాయం కొంచెం పెట్టింది. "మరి.. మరే...ఇంకా కొంచెం పెట్టు. నీకు మాంచి కథ చెప్తా" అన్నాడు.

"అబ్బా! అంతా తీసేసుకుందామనా నీ ఆశ...అమ్మదాంగో!" అంది శారద "అయితే పోన్లే..." అంటూ బుంగ మూతి పెట్టాడు సుబ్బారావు.

"ఓ అమ్మాయి నెత్తిమీద గోరింకో" అంటూ హేళన చెయ్యటం మొదలెట్టాడు. శారదకు కోపంవచ్చింది. "వెధవ!" అని తిట్టింది. సుబ్బారావు రెండు మొట్టికాయలు వేశాడు. శారద ఏడుస్తూ అమ్మదగ్గరకు పోయింది.

• • •

కళ్ళవెంబడి నీరు కారుతూనే ఉంది. ఒక్కసారి ఉలిక్కిపడి లేచింది. ఎక్కడుంది తను? ఏమిటి ఆలోచిస్తూంది? షుమారు పది సంవత్సరాలక్రిందట జరిగిన సంఘటన, తన ఆలోచనాపథంలో నిలబడింది. ఎడ తెగని ఆలోచన; ఆధారంలేని ఆలోచన; విషాదాంతపు ఛాయల్లో నడచిన తన జీవితానికి నాంది యేమో ఆసంఘట నని పిస్తుంది. తన జీవితం విషాదాంతం కావటానికి కారణం ఎవరు? ఆలోచిస్తూంది. తన గతజీవితపు సంఘటనలను ప్రస్తుత పరిస్థితులలో సమన్వయింప చెయ్యాలని ఆమె ఉబలాటం; బాధపడటమే తనకొక ఆభరణగా అమరింది; పమిటతో కళ్ళ వెంబడి కారే నీళ్ళను తుడుచుకుంది; మళ్ళీ ఆలోచిస్తూంది... బావ ఇప్పుడు తనమాట వింటాడా? తనను జ్ఞాపకం ఉంచుకోన వలసిన అవసరం యేముంటుంది? అయినా బావ ఇంకా వివాహం చేసుకోక పోయేందుకు కారణం యేమిటో...తానను భ

విస్తున్న యీ విచిత్ర కథాగమనం బావకు తెలియజేస్తే!.. తన నర్థంచేసుకునే మనస్తత్వం ఉంటుందా బావకు? ఒకవేళ అర్థంచేసుకున్నా, తనని ఆదరిస్తాడని నమ్మకమేమిటి? ..యేమిటో! అలోచిస్తూంది.... "ఒకసారి బయలుదేరి రావాలని వ్రాస్తే" హడలిపోయింది. మనస్సులో యెక్కడో లేనిపోని ఆందోళనకలిగింది. ఎక్కడ బావ? ఎక్కడ తను?

తన ముఖాన్నున్న కుంకుమ చెరిగిపోయిందే-చెరుపుకోవాలని చెరుపుకున్నది కాదది; విధాత విధించిన విధే! శారద ఇప్పుడు నిండుజవ్వని; జీవిత ఆనందపు ఘడియల్లో ప్రవేశించే సమయానికే, తన ఆనందానికి విఘాతం కల్గింది.. ఆశాసౌధాల్లో విహరిద్దామనుకున్న వేళనే, నిరాశామేఘాలు క్రమ్ముకున్నాయి; శారద భర్తపోయి రెండు సంవత్సరాలు కావస్తూంది; తాను ఆశించిన ఆశయాలన్నీ అంతరించి పోయాయి; తను చిన్నతనం నుండి ప్రేమించిన బావను వివాహం చేసుకునే స్వాతంత్రమేనా లేకపోయింది; పోనీ బావను మరచిపోయి, తన నూత్నజీవితంల్లో మధువసంతాన్ని తిలకిద్దామనుకున్నా, వీలులేకపోయింది; మళ్ళీ ఇప్పుడు బావనుగురించి తలుచుకుంటే అపరాధం క్రింద జమకట్టబడుతుందేమో .. కాని ఒక్కవిషయం-బావ విశాలహృదయంల్లో తనకింకా స్థానముంటుందని నమ్మకంఉంది. బావ తనూ వీధివెంబడి వెడ్తూంటే యెంతో ముచ్చట పడ్తూండేవారు... అప్పుడు తను పొందిన అనుభూతి!... తలచుకున్నా లాభంలేదు; తలుచుకుంటేనే తప్పు!...అసలు బావకిచ్చి పెళ్లిచెయ్యడం, అమ్మకూ నాన్నకూ సుతరామూ యిష్టం లేదు; . ఆఖరుసారి బావయింటికి వచ్చినప్పుడు తననుగురించి అమ్మతో నాన్నతో ఎంతవాదంపడలేదూ. అదృశ్యం యింకా తన కళ్ళముందు కనపడుతూన్నట్టుగానే ఉంది.

"అత్తయ్యా దూరం ఆలోచించు; చిన్నతనంనుండీ శారద నేను అరమరిక లేకుండా ఎలా పెరిగామో నీకు తెలియనిది కాదు. ఎవడో నాకంటే ఎక్కువ ఆస్థిపరుడని, అందంగా ఉన్నాడని చెయ్యడం ఏం భావ్యంగాలేదు;...అప్పుడే నువ్వొక విషయం ఆలోచించాలి; నీకు కావలసింది పిల్ల సుఖంగా, ఆనందంగా జీవించాలనేనా... నేను ఒక సంవత్సరంల్లో బియ్యేపూర్తి చేసేస్తాను. ఏదో ఒక గవర్నమెంటు నౌకరీ సంపాదించలేకపోను ..బాగా ఆలోచించు..''అంటూ బావ హెచ్చరిస్తూంటే, అమ్మా, నాన్నా యేం మాట్లాడలేకపోయారు; ఏవో లేనిపోని కారణాలను మనస్సులో ఉంచుకుని, పిల్ల సౌఖ్యమైనా లెక్కచెయ్యకుండా, నడచిన తన తల్లి

దండ్రులను ఏమని "ఛార్జిషీటు" చెయ్యాలో తన కర్థంకావటంల్లేదు; వెళ్ళిపోతూ తనలో అన్నాడు, "బావ నిండు హృదయంలో ఎప్పుడూ నీకు స్థానం ఉంటుంది శారదా! ఎప్పుడు ఏ కష్టాలలో ఉన్నా ఒక ఉత్తరం వ్రాయి; తప్పక నా చేతనైన సాయంచేస్తా." అప్పుడు తను బావమాటకు అడ్డువచ్చింది, "మరి, నువ్వుగూడా పెళ్లి చేసుకుని..." అని అంటూంటే, బాధతో అభినయాన్ని చూపుతున్న కళ్లతో చూస్తూ అన్నాడు "శారదా! ఆ మాట తలపెట్టకు; ఇంత వరకూ జరిగినజీవితం మధువసంతం; శేష జీవితపు పంథాముళ్ళపొద." అని అన్నప్పుడు తను ఎంతగానో యేడ్చింది... ఇవన్నీ తల్చుకొంటూంటే...ఎంతో బాధ తనకు! ఇలా అర్థంల్లేని ఆలోచన్లతో ఎన్నో రాత్రుళ్లూ, పగళ్లూ గడచిపోయాయి.

◆ ◆ ◆

ఒకానొక రోజున ఒక నిర్ధారణకొచ్చింది. బావకు ఉత్తరం వ్రాయాలని నిశ్చయించింది. కలం, కాగితంతో జత పరచి అక్షరాలువ్రాయటం మొదలెట్టింది. ఏమని వ్రాస్తోంది తను! — తనని వివాహం చేసుకోమని...అపచారమేమో! అసలా విషయమే పట్టించదలుచుకోలేదు. తన జీవితాన్ని సర్వవిధాలా నాశనం చేసిన తల్లిదండ్రులను లెఖ్ఖచెయ్య దలుచుకోలేదు ... విధవావివాహం ... సంఘంల్లో తప్పుబట్టరు - నయమే. ఈ సమాజాన్ని చీకటి కొట్టులోంచి, వెలుతురికి తీసుకుని వచ్చిన సంస్కర్తలు, మహాత్ములు రామమోహన్ రాయ్, వీరేశలింగంపంతుళ్లకు మనసారా అంజలి ఘటించింది...ఉత్తరం పూర్తిచేసింది; దృఢనిశ్చయంతో, ద్విగుణీకృతోత్సాహంతో జవాబుకై ఎదురుచూస్తోంది!

అనుకున్నట్లుగానే బావదగ్గర్నుండి జవాబువచ్చింది-చదువుతూంది, "శారదా నీ యీ హ్రస్వ జీవితకాలంలో ఎన్ని పరిణామాలొచ్చాయో! ఎన్ని అనుభవాలు పొందావో! నీ హృదయంలోని ఆవేదనను, నా ఆవేదనతో సరిపోల్చుకున్నా; అర్థమయింది నీ ఉద్దేశం - నీ పరితాపం; రెండు రోజుల్లో బయలుదేరి వస్తూన్నా...నీ అబలత్వాన్ని వెనక్కునెట్టి సంస్కరణతో ముందుకు వచ్చిన నీకు నా ధన్యవాదాలు ..తప్పక మన వివాహం జరుగుతుంది; ప్రశాంతమయిన మనస్సుతో ఉండు...శలవు." ఎంత నిండు హృదయం బావది! బావ సహృదయపూర్వకంగా ఆహ్వానించేందుకు! ఆనందంతో, ఉత్సాహంతో,...తన్ను ప్రతిఘటిస్తూన్న శక్తులన్నిటినీ ఎదిరించి, ప్రగతిమార్గాన్నన్వేషించాలని, విజయచిహ్నంగా నవ్వుతూ, రెండడుగులు ముందుకు వేసింది శారద.

——(o)——